
సాక్షి బాపట్ల

మంగళవారం । 18 । మార్చి । 2025



లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

క్రోసూరు: బయ్యవరం గ్రామంలో సోమవారం లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల ఘనంగా జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



బాల్య వివాహాలు నేరం

నరసరావుపేట రూరల్: బాల్య వివాహాలు నేరమని డీఆర్‌ఓ మురళి తెలిపారు. నీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
బాపట్ల	6.24	4.57
గుంటూరు	6.24	4.57
నరసరావుపేట	6.26	4.59

అ‘పరిష్కార వేదిక’

సమస్యలతో పోరాడుతున్న హృదయాలు అధికారుల కరుణ కోసం నిరంతరం శ్రమిస్తూ ఓడిపోతున్నాయి. వేదనాభరితమై రగిలిపోతున్నాయి. అయినా కర్కశ యంత్రాంగం దయ చూపడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గుండె గోడు పట్టించుకోవడం లేదు. పైగా సమస్య పరిష్కారమైపోయినట్టు మాత్రం రికార్డుల్లో నమోదు చేసుకుంటోంది. ఫలితంగా పేదలు సతమతమవుతున్నారు. మళ్లీ అర్జీలు చేతబట్టి వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్ మెట్లు ఎక్కుతున్నారు. ఈ ని‘వేదనల’ పర్వానికి ముగింపు పలికేదెప్పుడో సర్కారే చెప్పాలి.

ని‘వేదనల’ పర్వం

- వేలల్లో అర్జీలు.. పదుల్లో పరిష్కారం
- సాకులు చూపి తప్పుకుంటున్న అధికారులు
- పరిష్కారం కాకున్నా ఫోన్‌లకు క్లియరెన్స్ సమాచారం
- మెసెజ్‌లు చూసి నివ్వెరపోతున్న బాధితులు
- నెలల తరబడి కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బాపట్లటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) అధికారులంతా ఒక్కచోట ఉండే వేదిక. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించే అద్భుత కార్యక్రమం. ప్రతి సోమవారం కలెక్టరేట్, పోలీసు జిల్లా కార్యాలయాలతోపాటు డివిజన్, మండల స్థాయి కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుంటుంది. గత ప్రభుత్వ పాలనలో స్పందన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగింది. వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి అప్పటి సర్కారు చిత్తశుద్ధితో కృషి చేసింది. ఒకవేళ ఆ అర్జీ పరిష్కరించదగినది కాకపోతే బాధితులకు అర్థమయ్యేలా వివరించి.. మానవతా దృక్పథంతో వారికి ప్రత్యామ్నాయ పద్ధతుల్లో న్యాయం చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి ఫలితాలు రాబట్టింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రీవెన్స్ అభాసుపాలవుతోంది. సమస్యలు పరిష్కారం కావడం లేదని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. అయినా అధికారులు సమస్యలు పరిష్కారమైనట్టు సందేశాలు పంపిస్తుండడంతో ఏం చేయాలో పాలుపోక ఆవేదన చెందుతున్నారు.



జిల్లా కలెక్టర్, అధికారులకు సమస్యలు వివరిస్తున్న బాధితులు

మాటలతో పరిష్కారమైనట్టేనా..!

వాస్తవానికి ఒక అర్హత కలిగిన వ్యక్తి పెన్షన్ కోసం అర్జీ పెట్టుకుంటే.. ఆ పింఛన్ నగదు అతని చేతికి అందినప్పుడే ఆ సమస్య పరిష్కారమైనట్టు.. అయితే అధికారులు వింత పోకడలు పోతున్నారు. పెన్షన్ త్వరలో మంజూరు చేస్తామని సమాధానం ఇచ్చి ఆ అర్జీ పరిష్కారమైనట్టు చూపిస్తున్నారు. అలాగే రోడ్డు కోసం అర్జీ వస్తే నిధులు రాగానే పూర్తి చేస్తామని చెప్పి అర్జీని క్లోజ్ చేస్తున్నారు. ఇలా సమాధానాలతో సమస్యలు పరిష్కారమైనట్టేనా అని అడిగితే అధికారుల వద్ద జవాబు లేదు.

అవినీతి తాండవం

ముఖ్యంగా రెవెన్యూ అర్జీల విషయంలో అవినీతి పెచ్చుమీరిందనే వాదన అర్జీదారుల నుంచి వ్యక్తమవుతోంది. ఉదాహరణకు భూముల సంబంధిత అంశాలపై అధికారుల వద్దకు వెళితే సర్వేయర్లు, వీఆర్వోలు లంచాలు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. లేకుంటే ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని పెడసరిగా సమాధానం చెబుతున్నారని తెలుస్తోంది. ఉన్నతాధికారుల వద్దకు వెళ్లినా.. మళ్లీ కిందిస్థాయి సిబ్బంది వద్దకు రావాల్సిందే.. అప్పుడైనా ముట్టజెప్పాల్సిందేనని అర్జీదారులు చెబుతున్నారు.

వీఆర్వోనే కబ్జా చేశాడు



నాకు ఖాతా 70 సెంట్ల భూమి ఉంది. ఆ భూమిని నేను 2006లో తేళ్ళ సువార్తమ్మ దగ్గర కొనుగోలుచేశాను. నా పేరుతో అడంగల్, 1బీ ఉన్నాయి. ఇటీవల నా పొలంలో నుంచి 10 సెంట్లు భూమిని మార్టూరు మండలంలో వీఆర్వోగా పనిచేస్తున్న తేళ్ల అంజయ్య తన పేరుతో ఆన్‌లైన్ చేసుకున్నాడు. న్యాయం కోసం తహసీల్దార్, కలెక్టరేట్ చుట్టూ ఆరునెలలుగా తిరుగుతున్నా.. ఇప్పటికీ ఫలితం లేదు. వచ్చిన ప్రతిసారి రూ.1,000 ఖర్చు అవుతుంది. సమస్యమాత్రం పరిష్కారం కావడం లేదు.

– రామమూరి ప్రభాకరరావు, కొరిశపాడు

అంతా మోసమే



నాకు 2.60 ఎకరాల భూమి ఉంది. దీనిని 22ఏ(1)(సీ)లో చేర్చారు. అదేమని అడిగితే సమాధానం లేదు. మూడుసార్లు కలెక్టరేట్‌కు వచ్చా. సమస్య పరిష్కారం కాలేదు. తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ అందరినీ కలిశా. సమస్య పరిష్కరించినట్టు సమాచారం వచ్చినా రికార్డులు మారలేదు.

– పెంటాల వెంకటేశ్వర్లు, ద్రోణాదల, మార్టూరు మండలం

నెలల తరబడి తిరుగున్నా.. ఫలితం లేదు



నాకు గోకరాజు పాలెం రెవెన్యూపరిధిలో 3.90 ఎకరాలు, మంగలపాలెం పరిధిలో 40 సెంట్లు, వాదలో ఎకరం మొత్తం కలిపి 4.90 ఎకరాల భూమి ఉంది. ఖాజీపాలెంలో మరో 16 సెంట్ల స్థలంలో ఇల్లు ఉంది. నా భర్త సూర్యనారాయణ చనిపోయారు. నాకు 80 ఏళ్లు. నలుగురు మగపిల్లలు. ఇద్దరు ఆడపిల్లలు. నా పేరుతో ఉన్న ఆస్తిని నా పెద్దకొడుకు నాకు తెలియకుండానే తన పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. నన్ను, మిగిలిన వారిని దిక్కులేనివారిగా చేశాడు. గ్రామంలోని లైబ్రరీలో బతుకుతున్నాను. ఇంట్లో జరగకపోవడంతో పొలం పనులకు వెళ్తున్నా. అధికారులు స్పందించి నా ఆస్తిని నాకు చెందేలా చూడాలి. మూడునెలలుగా తిరుగుతున్నా.. ఫలితం లేదు.

– వారణాసి మూర్తి శ్యామల, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం మండలం

తహసీల్దార్ దురుసుగా ప్రవర్తించారు



నాకు తోటవారిపాలెం రెవెన్యూ పరిధిలో ఎకరం భూమి ఉంది. మేము 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. నా పేరుతో రికార్డులన్నీ ఉన్నాయి. నా భర్త జేమ్స్ మూడేళ్ల క్రితం చనిపోయారు. నా కొడుక్కి పక్షవాతం వచ్చి మంచంలోనే ఉంటున్నాడు. నేను వ్యవసాయం చేయలేక మూడేళ్ల క్రితం భాగ్యరాజు అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చాను. మాకు తెలియకుండా మా పొలాన్ని అతనిపేరుతో ఆన్‌లైన్ ఎక్కించుకొని ఏడాది నుంచి కౌలు ఇవ్వడం లేదు. అడిగితే నీకు దిక్కున్నచోట చెప్పుకోమన్నాడు. తహసీల్దార్ దగ్గరకు వెళితే దురుసుగా ప్రవర్తించారు. కాగితాలు నీ మొహాన వేసి కొట్టుకో అంటూ దుర్భాషలాడారు. న్యాయం చేయాలని కలెక్టర్ ఆఫీసుకు ఇప్పటికి మూడు సార్లు వచ్చాను. అయినా పరిష్కారం కాలేదు.

– దేవరపల్లి ఏలిశమ్మ, బుర్లవారిపాలెం, చీరాల మండలం

కబ్జాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు



చీరాల మండలం, పేరాల పరిధిలోని మరియమ్మ పేటలో మాకు పట్టాలు మంజూరు చేశారు. ప్రస్తుతం కొందరు అధికారపార్టీకి చెందిన నాయకులు మా స్థలాలను కబ్జాచేసి మా స్థలంలోని రాళ్లు పీకేశారు. మాకు న్యాయం చేయాలని ఆరు నెలల నుంచి చీరాల, బాపట్లలోని రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా మా గోడు ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

– శాంతినగర్ మహిళలు, చీరాల

ఆక్రమణలు పెరిగాయి



చీరాల మున్సిపాలిటీ, 31వ వార్డు పరిధిలోని పేరాల రోశయ్యకాలనీ, సెయింట్ ఆన్స్ స్కూల్ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను కొందరు నాయకులు ఆక్రమించుకుంటున్నారు. అదేవిధంగా రోశయ్యకాలనీ చుట్టుపక్కల, మరియమ్మపేట ప్రాంతాల్లో కూడా భారీగా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. వీటిపై లిఖితపూర్వకంగా అర్జీ ఇచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

– కొండ్రు కిరణ్‌కుమార్, చీరాల

న్యూస్‌రీల్

వినుకొండలో వృద్ధురాలి హత్య

మెడలో బంగారు గొలుసు మాయం



మృతురాలు సావిత్రి(ఫైల్)

వినుకొండ: వినుకొండలో పట్టపగలే దారుణం చోటుచేసుకుంది. కొత్తపేటలో నివాసం ఉంటున్న వృద్ధురాలు కొప్పరపు సావిత్రి(70)ని దుండగులు పట్టపగలే హత్య చేసి మెడలోని బంగారు గొలుసు చోరీ చేశారు. సమాచారం తెలుసుకున్న టౌన్ సీఐ శోభన్‌బాబుతోపాటు పోలీసు సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. బంగారు గొలుసు కోసమే హత్యచేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ ఇంటిలో లేకపోవటం గమనార్హం. పగలే హత్య చేసి టీవీ సౌండ్ ఎక్కువగా పెట్టి పరారయ్యారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీ.వీ.ఆంజనేయులు ఇంటికి కొద్దిదూరంలోనే ఈ దారుణం చోటు చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డాగ్‌స్క్వాడ్ తో పరిశీలన అనంతరం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి కేసును త్వరలోనే ఛేదిస్తామని సీఐ తెలిపారు.

వైద్యమిత్రల ధర్నా



నరసరావుపేట: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో గత 17 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా తమకు ఇప్పటికీ సరైన జీతాలు లేక తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని వైద్యమిత్రలు విన్నవించారు. సోమవారం ప్రకాష్‌నగర్‌లోని ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయం ముందు శాంతియుత నిరసన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. తాము ప్రతి నెట్‌వర్క్ హాస్పిటల్‌లో ఆస్పత్రికి, రోగులకు మధ్య అనుసంధాన కర్తలుగా వుంటూ పేద ప్రజలకు సేవలు అందజేస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, తమ సర్వీసుని పరిగణనలోకి తీసుకొని ట్రస్ట్ ఉద్యోగిగా కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని కోరారు. ఉద్యోగ విరమణ తరువాత కుటుంబానికి రూ.15లక్షల గ్రాడ్యుటీ ఇవ్వాలని, అంతర్గత ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.

గోగులమ్మను తాకిన సూర్య కిరణాలు



పెదపులివర్రు (భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మను సోమవారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. ఏటా ఫాల్గుణ నెలలో అమ్మ విగ్రహంపై కిరణాలు ప్రసరిస్తాయని అర్చకులు దీవి గోపి తెలిపారు. ఈ అపురూప దృశ్యాన్ని భక్తులు దర్శించుకుని తరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మత్స్యావతారంలో శ్రీవారు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి ఆస్థాన అలంకార ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన దూర్జటి మధుసూదనరావు, చెంచు వెంకట సుబ్బారావులు వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన మిశ్లారి రామచంద్ర శర్మ, కృష్ణవేణి దంపతులు వ్యవహరించారు.

పది పరీక్షలు ప్రారంభం

- 103 కేంద్రాల్లో నిర్వహణ
- కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా
- స్క్వాడ్ బృందాల తనిఖీ

బాపట్లటౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు తమ ఇష్టదైవాలను ప్రార్థించుకుని పరీక్షలకు బయలుదేరారు. ఫలితంగా బాపట్ల పట్టణంలోని ఆంజనేయస్వామి, సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, క్షీరభావన్నారాయణస్వామి ఆలయాలు విద్యార్థులతో కిటకిటలాడాయి. పరీక్షకు గంట ముందుగానే విద్యార్థులు ఆయా పాఠశాలల వద్దకు చేరుకున్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డీఈఓ ఎస్.పురుషోత్తమ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

234 మంది విద్యార్థులు గైర్హాజరు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 103 సెంటర్లు ఉండగా వాటిల్లో తొలిరోజు నిర్వహించిన తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు సంబంధించి మొత్తం 16,481 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16,247 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 234 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్షలు జరిగాయి. స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. 103 పరీక్ష కేంద్రాల వద్ద ఎస్పీ తుషార్‌డూడీ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లను మూసివేయించారు.



హాల్‌టిక్కెట్ నెంబర్లను వెతుక్కుంటున్న విద్యార్థులు

మజామజాగా కబ్జా





చీరాల సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి, అధికార పార్టీ కౌన్సిలర్ ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన షెడ్లు

- పచ్చనేతల పరాకాష్ట!
- మున్సిపల్ స్థలాలు అడ్డగోలుగా ఆక్రమణ
- రెండెకరాలకుపైగా ఆక్రమణ
- పట్టనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు

చీరాల: జాగా దొరికిందా.. పాగా వేసేయ్ అన్న చందంగా చీరాల టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు వ్యవహరిస్తున్నారు. అధికారం చేతిలో ఉందని రెచ్చిపోతున్నారు. మున్సిపల్ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. ఆక్రమించిన స్థలాల్లో కట్టడాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. చీరాల మున్సిపాలిటీ 31వ వార్డు పరిధిలోని సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద, మరియమ్మపేటలోని శ్మశాన వాటిక ప్రాంతంలో ప్రభుత్వ భూమి రెండు ఎకరాలకుపైగా టీడీపీ నేతలు కబ్జా చేసి ప్లాట్లుగా వేసి యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. సెయింట్ ఆన్స్ స్కూలు పక్కన ఉన్న టీఎస్ 8–3లో 50 సెంట్లు, 8–1 సాన పోరంబోకు స్థలాలు ఎకరం 50 సెంట్లపైగా కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదు.

పేదలకిచ్చేందుకు సెంటు భూమి దొరకదా !

చీరాల మున్సిపాలిటీలో పేదలు, రోజువారీ కూలీలు అధికంగా ఉన్నారు. చాలామంది సంపాదనలో సగం ఇంటి అద్దెలకు పోస్తున్నారు. వీరికి ఇచ్చేందుకు అధికారులకు సెంటు భూమి దొరకడం లేదు. అధికారపార్టీ నేతలు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు మాత్రం ఎకరాలకు ఎకరాలు కబ్జా చేస్తున్నారు. కట్టడాలూ నిర్మిస్తున్నారు. ప్లాట్లుగా వేసి అమ్ముకుంటున్నారు కూడా.. సెయింట్ ఆన్స్ స్కూలు గోడను ఆనుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఓ నేత రేకుల షెడ్లు నిర్మించారు. ఇంకో నాయకుడు అయితే పది సెంట్లు భూమిని కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించి రెండు సెంట్లు చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. అలానే పేదలకు, తమిశలకు గతంలో ఇచ్చిన స్థలాలను సైతం అధికార పార్టీ నేతలు కబ్జా చేస్తున్నారు. ఇళ్లనూ ఆక్రమించి అమ్ముకుంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డులో జరుగుతున్న ప్రభుత్వ భూముల ఆక్రమణలు నా దృష్టికి వచ్చింది. సర్వేయర్లతో పాత రికార్డులు పరిశీలన చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆక్రమణలు జరగకుండా చట్ట ప్రకారం కృషిచేస్తా.

–కె.గోపీకృష్ణ, తహసీల్దార్

రూ.1,534 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

మేయర్ రాజీనామాతో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెహ్రూ నగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో సుమారు 361 పనులకు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని కమిటీ అధ్యక్షుడు కొమ్మినేని కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. నగర మేయర్ రాజీనామా చేయడంతో ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ 1955 ప్రకారం స్టాండింగ్ కమిటీ సభ్యుల్లో ఒకరిని సమావేశానికి తాత్కాలిక అధ్యక్షులుగా ఎన్నుకోవచ్చన్న నిబంధన మేరకు స్టాండింగ్ కమిటీ సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావును అధ్యక్షులుగా ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో రూ.670.23 కోట్ల ప్రారంభ నిల్వ, రూ.864.04 కోట్ల జమల అంచనాతో మొత్తం రూ.1534.27 కోట్లతో 2025–26 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నూకవరపు బాలాజీ, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎగ్జామినర్ నాగేంద్ర కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, సెక్రెటరి పి.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

- అర్జీదారులకు అన్నదానం
- జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్లటౌన్ : జిల్లా నలుమూలల నుంచి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కార్యాలయానికి వచ్చే బాధితులకు అన్నదానం చేయటం సంతృప్తికరంగా ఉందని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చే అర్జీదారులకు జిల్లా కలెక్టర్ సోమవారం భోజన సౌకర్యాలను కల్పించారు. ప్రజా సమస్యలపై సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల సమస్యలను చూసి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో భోజనం తయారు చేయించి అందించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్

లక్ష్యాలను చేరుకోవాలి

ప్రగతిలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని మిర్చిపంటలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలో విద్యాశాఖ, రోడ్లు, భవనాలు, ఐటీఐ, మహిళా శిశు సంక్షేమశాఖ, మున్సిపాల్టీలో చెత్త నిర్వహణ, వైద్య విధాన పరిషత్ శాఖల పనితీరు సరిగా లేదన్నారు. ఆయా శాఖల అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు.

సర్వే పారదర్శకంగా చేయాలి

గ్రామ సచివాలయాల ద్వారా నిర్వహించే పలు సర్వేలు పూర్తిస్థాయిలో పారదర్శకంగా త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సచివాలయాల్లోని సిబ్బంది బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయడంలో జిల్లా వెనుకబడి ఉందని, ఏప్రిల్ మాసం నుంచి బయోమెట్రిక్ ఆధారంగానే జీతభత్యాల చెల్లింపులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

నాటుసారానూ పూర్తిగా నిర్మూలించాలి

నాటుసారాను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నవోదయం 2.0 పోస్టర్లను ఆవిష్కరించారు.

క్లుప్తంగా

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఆందోళనకు దిగిన ఆరోగ్యమిత్రలు



బాపట్లటౌన్: ఏళ్ల తరబడి డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్నా...మా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బడుగు రాజు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. రాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్నా మాకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. అనేక పర్యాయాలు దరఖాస్తు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో శాంతియుత నిరసన తెలియజేస్తున్నామన్నారు. వైద్యసేవ పథకంలో పనిచేసే ప్రతి ఒక్కరిని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి, కనీస వేతనం అమలుచేయాలి, వైద్యసేవ ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియో, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు అందించాలి. అర్హత ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల నిరసన

గుంటూరు మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యల పరిష్కారం కొరకు సోమవారం విధులు బహిష్కరించారు. గుంటూరులోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమారి, జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు.

పసుపు రైతులకు పరిహారం చెల్లించాలని వినతి



తెనాలి: దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాదంలో దగ్ధమైన పసుపునకు ప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారం పరిహారాన్ని త్వరితగతిన చెల్లించాలని బాధిత రైతులు తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహకు విజ్ఞప్తి చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 296 మందికి రూ.15 కోట్ల బీమా క్లెయిమ్ అయినట్టు సబ్‌కలెక్టర్ వెల్లడించారు. పరిహారం అందకపోవటంతో రైతులు ఆర్థిక సమస్యలతో అవస్థలు పడుతున్నారని చెప్పారు.

కాల్ మనీ.. కేటుగాళ్లు

- చీరాలపై పగడవిప్పిన పైశాచికం
- రూ.80 వేల ఇచ్చి రూ.5.75 లక్షలు ఇవ్వాలంటూ ఓ రౌడీషీటర్ బెదిరింపు
- ఆత్మహత్యకు పాల్పడిన బాధితురాలు
- మళ్లీ విస్తరిస్తున్న మైక్రో ఫైనాన్స్ వ్యాపారాలు

'జోగి ముత్యాలమ్మ. ఆమెది చీరాల వైకుంఠపురం. వయసు 67 ఏళ్లు. ఇంటి అవసరాలకు రౌడీ షీటర్, ఫైనాన్స్ వ్యాపారి చంద్రశేఖరరెడ్డి వద్ద రూ.80 వేలు విడతల వారీగా వడ్డీకి తీసుకుంది. అప్పును తీర్చేందుకు చంద్రశేఖరరెడ్డి వద్దకు పలుమార్లు వెళ్లింది. ఇప్పుడు డబ్బులు వద్దు.. తర్వాత తీసుకుంటానులే.. అని సున్నితంగా తిరస్కరించేవాడు. కొద్ది రోజుల తర్వాత అసలు, వడ్డీతో కలిపి రూ.5.75 లక్షలు ఇవ్వాలని కోరాడు. ఆమె నివాసం కానీ నగదు కానీ ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. భయంతో ఆ వృద్ధురాలు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది'. దీంతో బాధితురాలిని చికిత్స కోసం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటన జరిగి ఐదు రోజులు కావస్తుంది.



ఆత్మహత్యాయత్నం చేసి చికిత్సపొందున్న వృద్ధురాలు

చీరాల: చీరాల పట్టణం, రూరల్ మండంలోని గ్రామాలు, వేటపాలెం మండలంలోని గ్రామాల్లో కాల్‌మనీ వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పేదలు నివాసం ఉంటున్న ప్రాంతాలను ఎంపిక చేసుకుని రోజువారీ కూలీలకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి రోజువారీగా వసూలు చేస్తూ పేదల రక్తాన్ని వడ్డీలతో పీల్చుకు తాగుతున్నారు. ఇలా చీరాలలో కాల్‌మనీ కేటుగాళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఇల్లు రాసివ్వడం, లేదంటే ఊరు వదిలి వెళ్లిపోతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

రూ.100కు వడ్డీ రూ.30 వరకు..

కాల్‌మనీ వ్యాపారులకు అసలు కంటే వడ్డీపైనే ఆశ ఎక్కువ. పేదల అవసరాలను క్యాష్ చేసుకుంటూ లక్షలు గడిస్తున్నారు. అత్యవసరమై ఈ కాల్‌మనీ వ్యాపారి వద్ద రూ.10 వేలు వడ్డీకి తీసుకుంటే ఆ అప్పు చెల్లించే నాటికి రూ.40 వేలు చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి. పట్టణంలోని శివారు కాలనీలో చేతివృత్తులు చేసుకునే వారు. రోజువారీ కూలీలు, రిక్షా కార్మికులు వీరి బారిన పడి ఆస్తులను పోగొట్టుకొంటున్నారు. ఒక్కో వ్యాపారి సగటున నెలకు వడ్డీల రూపంలో రూ.10 లక్షలు గడిస్తున్నారని సమాచారం.

ఆర్థిక అవసరాలే క్యాష్..

చీరాల పట్టణంలో పేదలు అధికంగా నివసించే దండుబాట, పాలేటి నగర్, దళిత వాడలు, తమిళ కాలనీలు, స్వర్ణ రోడ్డు, గాంధీనగర్, ఆనందపేట, వైకుంఠపురం, విఠల్‌నగర్, హరిప్రసాద్‌నగర్, హయ్యర్‌పేట, థామస్‌పేట, గొల్లపాలెం తదితర ప్రాంతాల్లోని పేదలే ఈ కాల్‌మనీ కేటుగాళ్లకు ఆవాస కేంద్రాలు. పేదప్రజల ఆర్థిక అవసరాలను క్యాష్ చేసుకుంటున్నారు. చీరాల మండలంలోని ఈపురుపాలెం శివారు కాలనీలు, సాయికాలనీ, తోటవారిపాలెం, సాల్మన్ సెంటర్, రామకృష్ణాపురం, కొత్తపాలెం, చీరాలనగర్ గ్రామాలతో పాటుగా వేటపాలెంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో కాల్‌మనీ ఆగడాలకు పెట్రేగిపోతున్నాయి. తీసుకున్న అప్పులకు చక్రవడ్డీలు చెల్లించలేక ఉన్న ఒక్క ఇంటిని వారికి ఇచ్చి ఆ పేదలు ఊరి వదిలి వెళ్లిన ఘటనలు చాలా ఉన్నాయి.

మళ్లీ పుట్టగొడుగుల్లా మైక్రో ఫైనాన్స్ సంస్థలు..

పేదలు అధికంగా నివసించే ప్రాంతాల్లో కాల్ మనీ వ్యాపారులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు మళ్లీ వచ్చాయి. శాతవాహన, మారుతీ, సునీత, షేర్, స్పందన తదితర మైక్రో ఫైనాన్స్ సంస్థలు మళ్లీ వ్యాపారాలు ప్రారంభించాయి. ఇవే కాక కొన్ని స్టార్ ఫైనాన్సియర్లు పేదల ఇళ్లను తాకట్టు పెట్టుకుని అధిక వడ్డీలు చెల్లించలేక వారి ఇళ్లను లాక్కుంటున్నారు.

అడ్డుకట్ట వేయలేకపోతున్న ప్రభుత్వం..

కాల్‌మనీ, ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలు పెట్రేగిపోతున్నా, పలు ఫిర్యాదులు అందుతున్నా కానీ అధికారులు, ప్రభుత్వ పెద్దలు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ కాల్‌మనీ వ్యాపారాలు చేసే వారిలో చాలామంది టీడీపీ నేతల అనుచరులు, వారి నాయకుల వెనుకుండి వ్యాపారాలు చేయిస్తున్నారు.

ఉమ్మారెడ్డి గృహ ప్రవేశానికి సజ్జల హాజరు

స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



గృహ ప్రవేశం కార్యక్రమానికి హాజరై ఆశీర్వచనం పొందుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్సీతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, కార్యక్రమానికి హాజరైన అందరినీ పలకరించారు. అంతకు ముందు బాపట్ల నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలు సజ్జలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాగితపు సుధీర్‌బాబు, మండల అధ్యక్షుడు ఎం.కొండలరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జోగి రాజా, వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, విద్యార్థి విభాగం అధ్యక్షుడు సోహిత్ పాల్గొన్నారు. తొలుత ఆయనకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు.

మెడికల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

ధర్నాకు దిగిన జిల్లాలోని సీహెచ్‌వోలు



జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న జిల్లాలోని సీహెచ్‌వోలు

బాపట్లటౌన్: సిబ్బంది దిని వేధింపులకు గురిచేయడంతో పాటు మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి కారణమైన యద్దనపూడి మెడికల్ ఆఫీసర్ పమిడి శ్రీహర్షపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ జిల్లాలోని సీహెచ్‌వోలు (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)లు సోమవారం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. బాధితురాలు పసుపులేటి సరోజిని మాట్లాడుతూ యద్దనపూడి మండలం పెద జాగర్లమూడి గ్రామంలో మూడు సంవత్సరాలుగా సీహెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నానని, నేను మెటర్నిటీ లీవ్‌పై వెళ్లి తిరిగి జాయిన్ అయ్యానని తెలిపారు. అప్పటికే నా రికార్డులు, నా శాఖకు సంబంధించిన పరికరాలు లేవని, ఏమయ్యాయని ఆశా వర్కర్, ఏఎన్ఎంలను అడిగితే సరైన సమాధానం చెప్పలేదని తెలిపింది. రికార్డులు మొత్తం రాసుకున్నానని, రూ.20 వేలు ఖర్చుచేసి పరికరాలను కొనుగోలు చేశానని తెలిపింది. మరోసారి 9 నెలల తర్వాత మరలా రికార్డులు తారుమారుచేశారని, పరికరాలను మాయం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళితే ఆయన నోటికొచ్చినట్లు మాట్లాడటమే కాకుండా ఎఫ్ఆర్ఎస్‌లో వేలిముద్ర కూడా వేయనియ్యకుండా మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని తెలిపింది. మనస్తాపం చెందిన ఈనెల 8న గుంటూరులోని స్వర్ణాంధ్రనగర్‌లో ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపింది. ఉద్దేశపూర్వకంగా వేధింపులకు గురిచేస్తున్న మెడికల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ జిల్లాలోని సీహెచ్‌వోలు, ఎంఎల్‌హెచ్‌పిలు ధర్నాచేశారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు ధర్నా కొనసాగుతూనే ఉంది. డీఎంఅండ్‌హెచ్‌వో అందుబాటులో లేకపోవడంతో ధర్నా విరమించారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ధర్నాను కొనసాగిస్తామని సీహెచ్‌వోలు డిమాండ్ చేస్తున్నారు.

అర్జీల తక్షణ పరిష్కారానికి చర్యలు



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. 54 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీకు విన్నవించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ తుషార్‌డూడీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పాల్గొన్నారు.

పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు



ఈనెల 12వ తేదీ రాత్రి పట్టణానికి చెందిన వేమవరపు విజయ్‌కుమార్, మరో 10 మందితో కలసి పట్టణంలోని ఏబీఎం హైస్కూల్ గేటు, రూముల తాళాలను పవర్‌కట్టర్‌తో కట్‌చేసి స్కూల్‌లోని విద్యుత్‌మోటారు, విలువైన వస్తువులను తస్కరించారు. ఈ విషయంపై ఈనెల 13న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాం. పట్టించుకోవడం లేదు. పైగా ఫిర్యాదుదారులను రోజు మార్చి రోజు స్టేషన్‌కు పిలిచి చిత్రహింసలకు గురిచేస్తున్నారు. నిందితులు మాపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. చర్యలు తీసుకోవాలి.

–డి.జాన్‌ప్రసన్నబాబురావు, ఎస్.రోజిన్‌బాబు, సెక్రటరీలు ఏబీఎఫ్ఎంఎస్ ప్రొటెస్టెన్ కస్టోడియన్

నిందితులను కేసు నుంచి తప్పిస్తున్నారు

బాలికపై లైంగిక దాడి కేసులో మండలంలోని సూర్యలంక గ్రామానికి చెందిన మోపిదేవి దుర్గా అజయ్, చింతా దుర్గా, పీతా చిన్నిలపై ఫిర్యాదు చేశాం. పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితురాలైన ఏ 2 చింతా దుర్గను రాజకీయ ఒత్తిడితో అరెస్ట్ చేయకుండా ఏ1 అజయ్, ఏ3 చిన్నిలను అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారు. ఇదేమని అడిగితే మాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగురోజులుగా ఏ2 దుర్గా మీ అంతు చూస్తామంటూ బెదిరిస్తోందని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

– ఓ మహిళ, సూర్యలంక

తైక్వాండోలో చీరాల క్రీడాకారుల ప్రతిభ

చీరాల: తైక్వాండోలో చీరాల క్రీడాకారుల ప్రతిభ చాటారు. ఆదివారం తెనాలిలోని ఎన్టీఆర్ స్టేడియంలో అస్మిత కేలో ఇండియా ఉమెన్స్ లీగ్ జూనియర్, సీనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీరాల క్రీడాకారులు విశేష ప్రతిభ చూపి పతకాలు సాధించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పతకాలు సాధించిన 13 మంది తైక్వాండో క్రీడాకారులను మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ అభినందించి సత్కరించారు. తైక్వాండో పోటీల్లో పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొనగా చీరాల నుంచి పోటీల్లో పాల్గొన్న 20 మందిలో 13 మంది క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. తైక్వాండో పోటీల్లో పాల్గొనడం వలన ఆత్మరక్షణతో పాటుగా శారీరక దృఢత్వం, ఏకాగ్రత, స్నేహ బంధాలు పెరగడంతో పాటుగా స్పోర్ట్స్ కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు పొందుతారన్నారు. జూన్‌లో జరగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు చక్కని ప్రతిభ చూపి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. మంచి శిక్షణ అందించిన కోచ్‌లు సలావుద్దీన్, వెంకటప్రసాద్‌లను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ రషీద్

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో సోమవారం 410 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొమ్ములు 263 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.7,750 గరిష్ఠ ధర రూ.11,000 మోడల్ ధర రూ.9,000, కాయలు 147 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.7,750 గరిష్ఠ ధర రూ.9,700 మోడల్ ధర రూ.8,900, మొత్తం 307.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన




సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

బాపట్లటౌన్: సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోడూరి ఏకాంబీశ్వరబాబు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే అందజేయాలని కోరారు. జూలై 1, 2018, జనవరి 1, 2019 నాటి డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. వీటితోపాటు మధ్యంతర భృతి మంజూరు చేయాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు అడిషనల్ క్వాంటమ్ అందజేయాలని డిమాండ్ చేశారు. 70 ఏళ్ల వారికి 10 శాతం, 75 ఏళ్ల వారికి 15 శాతం, 80 ఏళ్ల వారికి 20 శాతంగా పునరుద్ధరణ చేయాలని సూచించారు. ఎంప్లాయీస్ హెల్త్ కార్డులతో ఉచిత వైద్యం అందించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వై.వి.నరసింహారావు, కార్యదర్శి పి.వి.ప్రసాద్, కోశాధికారి సుబ్బారావు, జనరల్ సెక్రెటరీ ఎన్. సిద్దయ్య, కోశాధికారి ఎం.వి బ్రహ్మం పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం
- వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సంచాలకులు



ఖాజీపేటలో పెసర పంటను పరిశీలిస్తున్న విజయసునీత

తెనాలి టౌన్: రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సంచాలకులు ఎం.విజయసునీత పేర్కొన్నారు. మంగళవారం తెనాలి నియోజకవర్గంలో ఆమె పర్యటించారు. రూరల్ మండలం ఖాజీపేట, హాఫ్‌పేట పరిధిలో రైతులు వేసిన పెసర పంటను పరిశీలించారు. గిట్టుబాటు ధరను తెలుసుకున్నారు. వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. దీంతో వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. కొల్లిపర మండలంలో అత్తోట గ్రామంలో పర్యటించి తెల్లజొన్నను పరిశీలించారు. క్వింటాకు రూ.2,200 ధర లభిస్తున్నట్లు రైతులు తెలియజేశారు. కొల్లిపరలో పసుపు రైతులతో మాట్లాడారు. క్వింటా రూ.8000 – రూ.11,000 మధ్య ఉందని రైతులు పేర్కొన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని ఆమె సూచించారు. మార్కెటింగ్ శాఖ విజయవాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు, గుంటూరు సహాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు డి.రాజాబాబు, తెనాలి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు కార్యదర్శులు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ జె.కృష్ణారావు, జీడీసీఎంఎస్ గుంటూరు బిజినెస్ మేనేజర్ హరిగోపాల్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంగళగిరి టౌన్: నగరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం... 5 రోజుల నుంచి ఓ వ్యక్తి పాతబస్టాండ్ సమీపంలోని హోటల్ దగ్గర ఉంటున్నాడు. అతని ఆరోగ్యం సరిగా లేదని, కొన్ని రోజులుగా భోజనం, తాగునీరు అందజేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఆ వ్యక్తి మృతి చెందాడని పోలీసులకు సమాచారం ఇచ్చారు.